

నేటి నుంచి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి వినోదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో చిన్నారులకు పండగ వాతావరణాన్ని తలపించేందుకు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వేసవి వినోదం నిర్వహిస్తున్నట్టు క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమం వచ్చే నెల 6వ తేదీ వరకు రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. పిల్లల్లో నైపుణ్యంతో పాటు జిజ్ఞాసను పెంచడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వేసవిలో పిల్లలకు ఆటవిడుపు కోసం క్లబ్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవిలో విజృంభిస్తున్న డెంగీ

- వేధిస్తున్న ప్లేట్ లెట్స్ కొరత
- బ్లడ్ బ్యాంకుల్లో నిండుకుంటున్న నిల్వలు
- దాతల కోసం స్వచ్ఛంద సేవకుల వెతుకులాట



జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ రోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒకప్పుడు కాలానుగుణంగా డెంగీ విజృంభించేది. ఎక్కువగా వర్షా కాలంలో దోమలు ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడేది. ప్రస్తుతం ఎండాకాలంలోనూ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. జిల్లాలో డెంగీ విజృంభణ అధికంగా ఉంటెంది. గడచిన ఐదు నెలల్లో జిల్లాలో 36 కేసులు నమోదైనట్టు గణాంకాలు చెపుతున్నాయి. ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరిన వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. జిల్లా కేంద్రంలో అత్యధికంగా బాధితులు మంచాన పడుతుండగా, రణస్థలం, లావేరు, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు వంటి మండలాల్లో, తీరప్రాంత గ్రామాల్లో ప్రభావం అధికంగా కనిపిస్తోంది.

రోగ నిర్ధారణ పరీక్షలు

డెంగీ పరీక్షలు గతంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, సర్వజనాస్పత్రుల్లో, ఉమ్మడి జిల్లా రాజాంలోని ప్రాంతీయాస్పత్రిలో మాత్రమే డెంగీ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. విభజన తర్వాత ఇప్పుడు పరీక్షలు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే జరుగుతున్నాయి. ఏమాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించకోవాలి. కానీ, ఎక్కువ మంది జ్వరం రాగానే స్థానికంగా ప్రథమ చికిత్స తీసుకుని అనంతరం ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. అక్కడ పరీక్షలు చేయించుకుని వైద్యం తీసుకుంటున్నారు. అయితే డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సర్వజనాస్పత్రిలోనే చేయించి నిర్ధారణ చేసుకోవాలి.

ఆకస్మికంగా అధిక జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల మంటలు, నొప్పి, అలసట, నీరసం, వాంతులు అవుతుండడం, అతిసారం, చర్మంపై దద్దుర్లు, చిగుళ్ల, ముక్కు నుంచి తేలికపాటి రక్తస్రావం, సులభంగా గాయాలు కావడం వంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలి. ఇటువంటి లక్షణాల్లో ఆస్పత్రిలో చేరిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖకు కచ్చితంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ వివరాల ఆధారంగా వారు నివాస ముంటున్న ప్రాంతంలో నివారణ చర్యలకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలు శుభ్రం లేకపోవడం, నీటి నిల్వ, పారేసిన కొబ్బరి కాయలు, కాలువల్లో మురుగు పేరుకుపోవడం దోమల ఆవాసాలకు ఆస్కారం కల్పించిన వారవుతున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

అలాగే వ్యాధి సోకినట్టు గుర్తిస్తే వైద్య నిపుణుల సూచనల మేరకు పరిసరాలను, శీతలీకరణ యంత్రాలను శుభ్రం చేసుకోవాలి. ఖాళీ కొబ్బరి కాయలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలి. వైద్య చికిత్సతో పాటు ఆహార నియమాలు పాటించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఒఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగడం, పళ్ల రసాలు వంటివి తీసుకోవాలి.

వ్యాధి లక్షణాలివీ..

దోమకాటు వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం, చైతన్య వంతులను చేసేలా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారూ వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేయిస్తే... గతంలో మలేరియా, టైఫాయిడ్ మాత్రమే వచ్చేవి. ఇప్పుడు వాటితో పాటు డెంగీ రోగులు సంఖ్య పెరుగుతోంది. ఎడిస్ ఈజిప్టి దోమ కారణంగా డెంగీ వైరస్ దరిచేరుతుంది. గ్రామాల్లో దీన్ని పులి దోమ కూడా అంటారు.

జ్వరంతో ప్రారంభమై అంతర్గత రక్తస్రావం వరకు చేరుకుని చివరికి ప్రాణాలను బలిగొంటుంది. ఈ రోగుల్లో అత్యధిక శాతం మందిలో రకత పీలికలు ఘననీయంగా తగ్గిపోతున్నాయి. వీటివల్ల అత్యవసరంగా రక్తమార్పిడి, ఇతర వైద్య సేవలు సకాలంలో అందించకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది.

వెంటాడుతున్న రక్తనిల్వల కొరత

ప్రధానంగా డెంగీ వ్యాధి సోకిన వ్యాధిగ్రస్తులకు ప్లేట్ లెట్స్ తగ్గి పోతున్నాయి. ఆ సమయంలో రక్తం ఎక్కించడంతో పాటు ప్లేట్ లెట్స్ (రక్త పీలికలు) ఎక్కించుకోవాల్సి వస్తోంది. రోగికి సరిపడా రక్త నిల్వలు సకాలంలో అందకపోతే ప్రాణాపాయ స్థితి ఎదురవుతుంది. జిల్లాలోని రక్తనిధి కేంద్రాల్లో ప్రస్తుతం రక్తం కొరత వేధిస్తోంది. దీనికి తోడు ప్లేట్‌లెట్స్ కావాలంటే స్క్రీనింగ్ చేసి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. స్వచ్ఛంద సేవలు రక్త నిల్వల కోసం కొంత సాయపడుతున్నారు. అయితే గ్రూప్ మ్యాచ్ కావడం, అనువైన రక్త పీలికలు సకాలంలో దొరకడం కష్టమవుతోంది.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

దోమలపై దండయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. డెంగీ నివారణపై ఇప్పటికే దృష్టిసారించాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షణ ఉంది. జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రం చేసుకుంటే దోమలు చేరవు. కిటికీలకు, తలుపులకు మెస్సు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో తెరలు వాడాలి. చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వ్యాధి విజృంభిస్తోంది. డెంగీ, మలేరియా చికిత్స ఆరోగ్యశ్రీ పరిధిలో ఉంది. బాధితులు సద్వినియోగం చేసుకోవచ్చు.

– బొడ్డేపల్లి మీనాక్షి, డిఎంహెచ్ఒ



లెక్కింపునకు సిద్ధమైన శివానీ ఇంజినీరింగ్ కళాశాల

ఎనిమిది గదుల్లో ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని ఎచ్చెర్ల సమీపాన గల శివాని ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి సంబంధించిన లెక్కింపు ఇక్కడే చేపట్టనున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఓట్ల లెక్కింపునకు కళాశాలలోని 8 గదులు సిద్ధం చేశారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీ, శాసనసభ స్థానాలకు మొత్తం 112 టేబుళ్ల వద్ద 173 రౌండ్లలో లెక్కింపు చేపడతారు. పర్యవేక్షణకు గాను ప్రతి నియోజకవర్గానికీ సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించారు.

పోస్టల్ బ్యాలెట్లు ఇక్కడే..

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడే జరగనుంది. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 38,865 పోస్టల్ బ్యాలెట్లు కేంద్రానికి చేరాయి. హోమ్ ఓటింగ్‌లో 556, ఉద్యోగ, ఉపాధ్యాయులు 22,797 మంది, సర్వీసు ఓటర్లు 15,512 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో సర్వీసు ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశ ముందని అధికారులు చెబుతున్నారు. వీరి ఓట్ల లెక్కింపునకు ఒక గదిని కేటాయించారు. మొత్తం 30 టేబుళ్ల 30 మంది ఇఆర్ఒలను వినియోగించనున్నారు. 20 స్కానర్లు అందుబాటులో ఉంచారు. 8 అసెంబ్లీ స్థానాల్లో హోం ఓటింగ్ ద్వారా 662 మంది, ఉద్యోగ, ఉపాధ్యాయులు 25,164, సర్వీసు ఓటర్లు 16,448 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 42274 పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు 8 గదులను కేటాయించారు. వీటి లెక్కింపునకు 29 టేబుళ్ళ, 37 మంది ఈఆర్ఒలను వినియోగించనున్నారు. 80 స్కానర్లు కూడా అందుబాటులో ఉంచారు.



పర్యాటకులను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

పర్యాటకుల సందడి

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి శివ సాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వాతావరణం రోజంతా చల్లగా ఉండటంతో పర్యాటకులు తీరానికి చేరుకుని వేసవి తాపం నుంచి సేద తీరారు. పలాస-కాశీబుగ్గ, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చారు. సముద్ర స్నానాలు, సహ పంక్తి భోజనాలు చేస్తు ఉల్లాసంగా ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గడిపారు. అల్పపీడనం కారణంగా సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో మెరిన్ పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేశారు.

జంగిల్ క్లియర్ చేపట్టాలి

కలెక్టర్‌కు లేఖ రాసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు




అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫులో వరి సాగుచేసే రైతులకు వంశధార కాలువలో పూడికలు తొలగించి శివారు గ్రామాలకు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆదివారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అత్యధిక ప్రజలు వ్యవసాయాధిరిత జీవనం సాగిస్తున్నారని, జిల్లాలో వ్యవసాయం పూర్తిగా వంశధారపైన ఆధారపడి ఉన్నదని అన్నారు. గత ఐదేళ్లుగా వంశధార ఎడమ కాలువ, దాని అనుబంధ కాలువులు మరమ్మతులకు నోచుకోక, జంగిల్ క్లీయర్ చేరిపోయిందన్నారు. దీంతో నీరు ముందుకు సాగక శివారు గ్రామాల భూములకు సాగునీరందక పంట పొలాలు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి కాలువలో గుర్ర పుడెక్కలను తొలగించాలని కోరారు. వంశధార పరివాహక ప్రాంతం ఉన్న నరసన్నపేట, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో తమరు వ్యవసాయ, వంశధార అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలించి స్థానిక రైతాంగానీ ఇందులో భాగస్వాములు చేసి శివారు భూములకు సాగునీరు అందించేందకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో 13 ఎత్తిపోతల పథకాలు నిర్మించామని అన్నారు. గతేడాది జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉన్నా పాలకుల చేతకాని తనం, అధికారుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరాను సైతం నిలిపి వేసి నీటి సరఫరాను అధికారులు నిలిపి వేశారని అన్నారు. దీంతో ఎత్తిపోతల పథకాల విద్యుత్ ఉపకారణాలు చోరీకి గురయ్యాయన్నారు. ఖరీఫులో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందుగా అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులకు అవసరమైన సూచనలు చేయాలని తెలిపారు.

టెన్షన్... టెన్షన్

- అంచనాల్లో అభ్యర్థులు
- ఊహల్లో కార్యకర్తలు



ప్రజాశక్తి- టెక్కలి

సార్వత్రిక ఎన్నికలు ముగిసి కౌంటింగ్‌కు రోజులు దగ్గరపడుతున్న క్రమంలో టెక్కలి నియోజకవర్గం అభ్యర్థుల్లో టెన్షన్ ప్రారంభమైంది. ఇప్పటివరకు జరిగిన పోలింగ్ అనుసరించి అంచనాల్లో అభ్యర్థులు ఉంటున్నారు. తమ నాయకుడే విజయం సాధిస్తాడని ఇరుపక్షాల పార్టీల కార్యకర్తలు, నాయకులు భుజాలు చరుచుకుంటున్నారు. మరో తొమ్మిది రోజుల్లో జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో బెట్టింగులు కూడా జోరందుకున్నాయి. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏడుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కానీ, ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. అధికారంలో ఉన్న వైసిపి తరుపు నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోటీలో ఉండగా, టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చనాయుడు, ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పోటీలో ఉన్నారు. టిడిపి అభ్యర్థిగా ఉన్న అచ్చెనాయుడు గెలుపుపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికల్లో టిడిపి శ్రేణులు శ్రమించినట్లు కనిపిస్తోంది. వైసిపిలో ఉన్న అసంతృప్తి, అసమ్మతి అభ్యర్థి వ్యక్తిగత, వ్యక్తిత్వం ఎన్నికల్లో ప్రధానంగా టిడిపికి లభిస్తాయని ఆ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఎనిమిది వేల పైచిలుకు మెజార్టీతో అచ్చెన్నాయుడు విజయం సాధించడంతో ఈ ఎన్నికల్లో అంతకు రెట్టింపుగా మెజార్టీ వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని 315 పోలింగ్ బూతులకు సంబంధించిన జాబితాలను సిద్ధం చేసుకుని ఒక్కొక్క బూతులో తమ పార్టీకి ఎన్ని ఓట్లు చొప్పున పడ్డాయనే లెక్కలు కట్టుకుంటున్నారు. అదేవిధంగా వైసిపి అభ్యర్థి శ్రీనివాస్ ఎమ్మెల్సీగా టెక్కలి నియోజకవర్గ ప్రజలకు పరిచయం అవ్వడమే కాకుండా వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలు, మూలపేట పోర్టు నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలే తమకు లాభిస్తాయని అంచనాల్లో వైసిపి అభ్యర్థి శ్రీనివాస్ ఉన్నారు. అయితే పార్టీ పరమమైన ఓట్లతో పాటు తనకున్న వ్యక్తిగత చరిష్మాని ఈ ఎన్నికల్లో దువ్వాడ వినియోగించుకున్నారు. తనపై వచ్చిన ఆరోపణలు వ్యక్తిగతమని, దానికి పార్టీకి సంబంధం లేదని ఒకపక్క చెప్పుకొస్తూ... నియోజకవర్గ నలుమూలల నుంచి కార్యకర్తలని సమీక్షించి పోలింగ్‌కి సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలోనే టెక్కలి నియోజకవర్గంలో వైసిపి విజయం సాధిస్తుందని, అయితే 2 నుంచి 3 వేలు ఓట్ల వరకు మెజార్టీ సాధిస్తామని వైసిపి నేతలు భుజాలు తలచుకుంటున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ తరపునుంచి పోటీ చేసిన కృపారాణి మాత్రం గతంలో తాను చేసిన అభివృద్ధి, కమ్యూనిస్టు పార్టీల బలం కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న సానుభూతి ఈ ఎన్నికల్లో తనకు లభిస్తుందని, అదేవిధంగా తరగతి పరంగా కూడా ఓట్లు పడతాయని కాంగ్రెస్ వర్గాలు ఆశిస్తున్నాయి. పధానంగా మూడు పార్టీలు ఎన్నికల్లో పోటీకి సిద్ధమైనా గెలుపోటములపై బూతులు వారీగా సమీక్షలు చేపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో తమ బహుతవ్యం ఈఇఎంల్లో భద్రపరచడంతో గెలుపోటములపై అభ్యర్థులు అంచనాలను వేస్తూ... లెక్కలు కడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో టిడిపి కేడర్ అచ్చెన్నాయుడు విజయానికి శ్రమించిన నేపథ్యంలో తామే విజయం సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా టెక్కలి నియోజకవర్గంలో తమ నాయకుడే గెలుస్తాడన్న అంచనాలపై పార్టీ క్యాడర్ ద్వితీయ శ్రేణి నాయకత్వం అంచనాలు కడుతూ విజయం వైపు ఆశగా ఉన్నారు.



మాట్లాడుతున్న చంద్రమోహన్

జనసేన జిల్లా కార్యవర్గ నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన పార్టీ జిల్లా కార్యవర్గాన్ని పార్టీ అధిష్టానం వెల్లడించింది. పార్టీ ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గతంలో అభ్యర్థులుగా ఉన్నవారికి, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఇందులో చోటు కల్పించలేదు. అధ్యక్షునిగా తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌ను మరోమారు అవకాశం కల్పించారు. అలాగే నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్‌కు ఆరుగురు జిల్లా ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమించారు. శ్రీకాకుళం నగరంలోని నాగావళి హోటల్‌లో ఆదివారం పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఆయన వెల్లడించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గర్భాన సత్తిబాబు, పాత్రుని పాపారావు, భూపతి అర్జున్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలుగా సంతోష్‌పండా, దానేటి శ్రీధర్, కూరాకుల యాదవ్, కోల్ల జైరామ్, రాజు, లోల్ల రాజేష్, జిల్లా కార్యదర్శులుగా 15 మంది సంయుక్త కార్యదర్శులుగా మరో 15 మంది కి చోటు కల్పించినట్టు సురేష్ తెలిపారు.

ఆదిత్యునికి యాత్రికుల తాకిడి



శ్రీకాకుళం అర్బన్ : వైశాఖ మాసం బహుళ తదియ ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. వేకుమజాము నుంచి పెద్దఎత్తున ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఓ వైపు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. వారికి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. రద్దీ పెరగడం వల్ల ఆలయానికి ఆదివారం ఒక్క రోజు వివిధ రూపాల్లో రూ.13.73 లక్షల ఆదాయం సమకూరిందని ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ సందర్శకుల నుంచి టిక్కెట్ల రూపంలో రూ.9,06,700లు, విరాళాల రూపంలో రూ.83,523లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,82,840 ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

నిరుపయోగంగా విత్తనాభివృద్ధి క్షేత్రం

- రైతులకు అందని విత్తనాలు
- పట్టించుకోని ప్రభుత్వం

అన్నదాతలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందజేసి రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా మారింది. దీంతో రైతులకు నిరాశే మిగిలింది.



విత్తనాభివృద్ధి క్షేత్రం ముఖద్వారం

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి ఏడాది నాణ్యమైన విత్తనాలు దొరక్క రైతులు పంటలు నష్టపోతున్నారని అన్నదాతలను ఆదుకునేందుకు, నాణ్యమైన విత్తనాలను అందజేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా 1976లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మండలం పెద్దపేటలో విత్తనాభివృద్ధి క్షేత్రానికి 110 ఎకరాలు భూమిని కేటాయించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ జిల్లాల రైతులకు అవసరమైన మేలురకం విత్తనాలను అందజేసే సదుద్దేశంతో విత్తనా భివృద్ధి క్షేత్రాన్ని ప్రారంభించింది. అప్పటినుంచి ఆయా ప్రాంతాలకు అవసరమైన విత్తనాలను అందజేస్తుంది. ముఖ్యంగా శాస్త్రవేత్తలు భూమిని పరిశోధన చేసి ఏ ప్రాంతానికి అవసరమైన విత్తనాలను ఆ ప్రాంతాలకు తగ్గట్టుగా విత్తనాలు సరఫరా చేస్తుంది. అయితే రానురాను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అభివృద్ధి క్షేత్రం క్షీణించడం మొదలైంది. పదేళ్లుగా ఈ విత్తనాభివృద్ధి కేంద్రంలో ఎటువంటి ప్రయోజ నాలు చేపట్టడంగాని, ఈ ఆరు జిల్లాలకు విత్తనాల సరఫరా చేయడం జరగలేదని రైతులు ఆవేదన చేస్తున్నారు.

మూలకు చేరిన యంత్రాలు

లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు నేడు మరమ్మతులకు గురై నిరూపయోగంగా పడి ఉన్నాయి. అంతే కాకుండా కొన్ని యంత్రాలు చోరీకి కూడా గురైనట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

మాయం అవుతున్న భారీ వృక్షాలు

ఈ క్షేత్రంలో ఉన్న భారీ టేకు చెట్లు మాయమవు తున్నాయని తెలుస్తుంది. కొన్నేళ్లుగా ఈ క్షేత్రంలో సిబ్బంది లేకపోవడంతో భారీ వృక్షాలు సైతం చోరీకి గురవు తున్నాయని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



శిథిలావస్థలో భవనాలు


శిథిలావస్థలో భవనాలు

లక్షల రూపాయలతో నిర్మించిన సిబ్బంది భవనాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. అప్పట్లో ఇద్దరు ఎఒలు, నైట్ వాచ్‌మెన్, ఇతర సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఒకే ఒక్క వాచ్‌మేన్ ఉన్నాడు. అప్పట్లో నిర్మించిన భవనాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి.

పట్టించుకోని అధికారులు

ఎంతో ఉన్నత ఆశయంతో ఉత్తరాంధ్ర రైతులకు అవసరమైన విత్తనాలను అందజేసేందుకు ఏర్పాటు చేసిన అభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా మారడం శోచనీయం. ప్రస్తుతం ఈ సంస్థ యొక్క యంత్రాలు నిరుపయో గంగా మారడంతో తుప్పుపట్టి మూలకు చేరాయని రైతులు పేర్కొన్నారు. అలాగే భవనాలు కూడా మూలకు చేరుకున్నాయని, రైతులకు ఎటువంటి మేలు చేకూరడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికా రులు, ప్రభుత్వం స్పందించి రైతులకు ఎంతగానో మేలు చేసే విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని తిరిగి అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

రైతుల గోడు పట్టించుకోవాలి



ఆరు జిల్లాల రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన విత్తనాభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా ఉంది. రైతులకు ఎటు వంటి మేలు జరగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల గోడు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అభివద్ధి క్షేత్రాన్ని ప్రారంభించి రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలి.

– పాలవలస రామినాయుడు, ఎపి రైతుసంఘం నాయకుడు

నాణ్యమైన విత్తనాలు కరువు



అభివృద్ధి క్షేత్రం ఉన్నప్పటికీ ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది. రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా జరగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు. రైతులకు అవస్థలు తప్పడం లేదు.

– సేపేన రమేష్, రైతు, తోటవాడ



మూలకు చేరిన యంత్రాలు

తగ్గిన మామిడి దిగుబడులు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- బూర్జ

మామిడి పండ్లకు మార్కెట్లో ధరలు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది మామిడి దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మండలంలో సుమారు 60 ఎకరాలకుపైగా మామిడి సాగులో ఉంది. బంగినపల్లి, చెరుకు రసాలు, తీయమామిడి, నీలం, కలెక్టర్ తదితర రకాల మామిడికాయలు సాగు చేస్తున్నారు. మండలంలో పండే మామిడికాయలను బెంగళూరు, హైదరాబాద్, నెల్లూరు, ఒంగోలు, రాయపూర్, విజయవాడ వంటి పట్టణాలకు ఎగుమతి చేస్తారు. గతేడాది టన్ను బంగినపల్లి మామిడి పండ్లు రూ.20వేల నుంచి రూ.30 వేలు ఉండగా ఈ ఏడాది రూ.42 వేల నుంచి రూ.50 వేల వరకు ధర ఎగబాకిందని రైతులు తెలిపారు. సరైన వర్షాలు కురువకపోవడంతో పూత ఆలస్యంగా మొదలైందన్నారు. పింజె దశలో ఉండగానే తెగుళ్ల ప్రారంభం కావడంతో ఎన్ని మందులు పిచికారి చేసిన ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో దిగిబడులు తగ్గిపోయాయి. మే నెలలో మార్కెట్లోకి అన్ని రకాల మామిడి కాయలు, పళ్లు రావాల్సి ఉండగా అరకొరగా వచ్చాయి. ఎండ తీవ్రత కూడా పెరగడంతో మార్కెట్లోకి పూర్తిస్థాయిలో వస్తాయి. మామిడి మార్కెట్లో బంగినపల్లి మామిడికాయలకు విపరీతమైన గిరాకీ ఉంది. కొంతమంది మామిడి సాగు రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలను మార్కెట్లోకి తరలిస్తున్నారు. కేవలం 3 నుంచి 4 టన్నులు మాత్రమే దిగిబడి వస్తున్నాయి. సగం దిగిబడులు తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం లేదని కౌలు రైతులు చెప్తున్నారు. నూటికి 40శాతం తోటలో మామిడికాయలు కాశాయి. మిగతా మామిడి దిగుబడి రాలేదని చెబుతున్నారు. మామిడికాయల ధరలు జూన్‌లో కూడా నిలకడగా ఉంటే పెట్టుబడులతో పాటు కొద్దిగా లాభాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో మామిడి ధరలు విపరీతంగా పెరిగినా సామాన్య ప్రజలు మామిడికాయలు కొని, తినే పరిస్థితి లేదన్నారు. దీనివలన అమ్మకాలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయని రైతులు తెలిపారు.


దిగుబడి తక్కువుగా ఉన్న మామిడి చెట్లు

కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దు


ఆమదాలవలస : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస: రాజకీయ పార్టీల కోసం అనవసర రాద్ధాంతాలతో వివాదాలు కొని తెచ్చుకొని పోలీసు కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గాజుల కొల్లివలస, నెల్లిపర్తి గ్రామాల్లో రాజకీయ వివాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎంతో సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఇంకా ఎన్నికల సంఘ నిబంధనలు అమల్లో ఉన్నాయని, కౌంటింగ్ రోజు కూడా ప్రతి గ్రామంలోనూ ప్రజలు పోలీసు నిబంధనలను పాటించి శాంతి భద్రతలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో తలదూర్చి తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతిఒక్క యువకుడు రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న సిఐ నల్లి సాయి

మెళియాపుట్టి : ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎటువంటి అల్లర్లకు దిగకుండా ప్రశాంతంగా ఉండాలని పాతపట్నం సిఐ నల్లి సాయి, ఎస్ఐ టి.రాజేష్ సూచించారు. మండలంలోని చాపర, చీపురుపల్లి గ్రామాల్లో శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు దళిత వాడకు చెందిన టిడిపి యువ నాయుడు గండి సురేష్ స్థానిక దళితవాడకు చెందిన యువతకు ఆదివారం నూతన క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ యువత విద్యతో పాటుగా క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహంతో పాటుగా ఆరోగ్యం బాగుం టుందన్నారు. క్రీడాల్లో యువత రాణిస్తే క్రీడల సాధనకు అవసరమైన కిట్లు తాను సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువత వింగ్ అధ్యక్షుడు కరిమేరకల అనిల్ కుమార్, చిరుతా తదితరులు న్నారు.

ఎస్‌జిఎఫ్ దాతృత్వం

కవిటి: విస్తృతమైన నెట్వర్క్ కలిగిన ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ మరోసారి దాతృత్వాన్ని చాటుకుంది. డి.గొనపపుట్టుగ పంచాయతీ వి.జల్లుపుట్టుగకు చెందిన దాశరథ దళాయి కొన్నేళ్లు ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రెక్కాడితే గాని డొక్కాడని దాశరథి కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి దాశరథకి ఆర్థికసాయం అందజేయాలని కోరారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు


లావేరు : కంప్యూటర్ కోసం వివరిస్తున్న రిసోర్స్‌పర్సన్ వి.జి శ్రీవిద్య

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు కంప్యూటర్ విజ్ఞానం నేర్చువాలని రిసోర్స్‌పర్సన్ భోగాపురం వెంకట నాగ శ్రీవిద్య అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం కంప్యూటర్ కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ అంటే ఏమిటి, అది చేసే పనులు, ఆపరేటింగ్ సిస్టం, ఇమెయిల్, ఇంటర్నెట్, వివిధ రకాల కంప్యూటర్లు, కీబోర్డ్ తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా కంప్యూటర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలు

నందిగాం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా, సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు గ్రంథాలయాధికారి ఎస్. ఉదయకిరణ్ కబడ్డీ, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. విజేతలకు 7న బహుమతులను అంద జేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు కె.రాములమ్మ పాల్గొన్నారు.

టెక్కలి : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు తమ చదువుల్లో భాగంగా ఆంగ్ల భాషపై అవగాహన పెంచుకోవాలని విశ్రాంతి ఆంగ్ల ఉపాధ్యాయులు మోహనరావు కోరారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి అధ్యక్షతన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. అనంతరం ఏకాగ్రత, కార్య సాధనకు లభ్యమయ్యే యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 107 మంది రక్తదానం చేసారు. శిబిరాన్ని ఫౌండేషన్ సభ్యుడు మహమ్మద్ తాజ్ మొహిద్దీన్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైనా మండు వేసవిని సైతం లెక్కచేయకుండా ఇంతమంది రక్తదానం చేయడం గర్వకారణమన్నారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇవి సత్యన్నారాయణ, అధ్యక్షులు ఇడదాసుల తిరుపతి రాజు మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని పిలుపునిచ్చారు. వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, జెఆర్ పురం సర్పంచ్ భవిరి రమణ, సెక్రటరీ లింగాల ఆదినారాయణ, మజ్జి రమేష్, గొర్లె స్వామి నాయుడు, ముల్లు రాంబాబు, ఇజ్జు శ్రీనివాసరావు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, మింద్రాన రామారావు, దన్నాన రమణ, పసుపురెడ్డి సురేష్, మహంతి గురునాయుడు, చోడిశెట్టి చంద్రశేఖర్, కూనిబిల్లి సత్యారావు, వార్డు మెంబర్ కరిమజ్జి నాగభూషణం, న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- సోంపేట

ఉద్యోగమంటే విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు వచ్చిన ఒక మంచి అవకాశంగా భావించి, జీవితాంతం వారి అభివృద్ధికి తన బోధనను అంకితం చేసిన దిస్క గోవిందరావు మాస్టర్ జీవితం అందరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. ఈ నెల 31న తన సుదీర్ఘ 38 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తికి ఉద్యోగ విరమణ చేస్తున్న మాస్టారు జీవితంలోని ముఖ్య ఘట్టాలు నేటి తరం ఉపాధ్యాయులకు మార్గదర్శకాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 1962 జూన్, ఒకటిన సోంపేట మండలం శారదాపురంలో పాపయమ్మ, కర్రెయ్య దంపతులకు ఆరో సంతానంగా గోవిందరావు జన్మించారు. ఆయనకు నలుగురు అన్నద మ్ములు, ఒక అక్క ఉన్నారు. తండ్రితో పాటు అన్న దమ్ములందరూ రైల్వేశాఖలో ఉద్యోగాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిపై గోవిందరావు ఎక్కువ ఇష్టం పెంచుకు న్నారు. తాను ఎంతో కష్టపడి కోరుకున్న ఉపాధ్యాయ వృత్తిలో 1986 నవంబరు 23న చేరారు. ఎం.ఎ, టిటిసితోపాటు బిఇడి చేశారు. పలాస మండలం గొల్లమాకన్నపల్లి సమితి పాఠశాలలో స్పెషల్ టీచర్‌గా తొలిసారి ఉద్యోగంలో చేరారు. అనంతరం ఎస్జిటిగా, స్కూల్ అసిస్టెంట్‌గా చేశారు. ఆయనకు 1988లో నారాయణమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి ఎన్‌టిపిసిలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద కోడలు మెకానికల్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. చిన్న కుమారుడు ఎలక్ట్రికల్ అకౌంట్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చిన్న కోడలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయుడుగా పలాస మండలం పెద్ద మాకన్నపల్లి, సోంపేట మండలం బుషాభద్ర, రామ కృష్ణాపురం, పాలవలస, మాకన్నపురం, జీడిపుట్టుగ కొత్తూరు, మొగలి కొత్తూరు, జింకిభద్ర పాఠశాలల్లో పనిచేశారు. 2019 జూలై, 10 నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా చేపల గొల్లగండి పాఠశా లలో పనిచేశారు. ఇదే సమయంలో ఎపిటిఎఫ్ సోంపేట మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఉపాధ్యా యులు సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. పాఠశాల విద్యార్థులు మండల, జిల్లాస్థాయి పోటీ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచడంలో ఈయన కృషి ఎంతో ఉంది. అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డులను అందుకుని, కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టిన వారికి ఆదర్శంగా నిలిచారు. మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఆయనకు ఎన్నో సత్కారాలు చేశారు. ఉద్యోగానికి మాత్రమే ఉద్యోగ విరమణ చేస్తున్నా నని, వాదనకు కాదని ఆయన చెబుతున్న మాటలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.


గోవిందరావు కుటుంబ సభ్యులు

స్వామి వివేకానంద స్ఫూర్తితో...

ప్రజాశక్తి- పలాస


శశిధర్‌వర్మ

ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయిలో ఉండి వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చడానికి చదువు ఒక్కటే మార్గదర్శకమని పెద్దింటి శశిధరవర్మ మాస్టారు ప్రగాఢ నమ్మకం. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మొగలిపాడు ఎంపియుపి స్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయుచున్నారు. మందస మండలం సువర్ణపురానికి చెందిన పెద్దింటి సింహాచలం, మహాలక్ష్మి దంపతులకు నాలుగో కుమారుడు. ఇతనికి ముగ్గురు అన్నదమ్ములు ముగ్గురు, అక్కాచెల్లెళ్లు ఉన్నారు. తండ్రి అస్సాంలో ఇండియన్ ఆయిల్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. అందువల్ల ఒకటి నుంచి ఐదో తరగతి వరకు అస్సాంలోనే ఇండియన్ ఆయిల్ కంపెనీ స్కూల్‌లో చదువుకున్నారు. తరువాత సొంత గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ ఆంధ్రా యూనివర్సిటీలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. తదనంతరం అదే యూనివర్సిటీలో పియుసి పూర్తి చేశారు. తరువాత అదే యూనివర్సిటీలో ప్రయివేటున బిఎ స్పెషల్ తెలుగు పూర్తి చేశారు. తరువాత పొద్దుటూరులో తెలుగు పండిట్ ట్రైనింగ్ తీసుకున్నారు. తరువాత ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఎ తెలుగు పూర్తి చేశారు. చదువు పూర్తి అయిన తరువాత సొంత గ్రామంలో స్వామివివేకానంద స్ఫూర్తితో సరస్వతి విద్యాలయాన్ని స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేశారు. వయోజన విద్య ద్వారా స్త్రీలకు చదువు నేర్పుతూ స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశారు. 2001 డిఎస్‌సిలో ఉద్యోగానికి ఎంపికై మండలంలో రంగోయి హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఉద్యోగం పొందారు. ఎంపియుపి స్కూల్ మొగలి పాడులో పనిచేస్తూ 2019లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు.

2017లో ఆంధ్ర బాల ద్విశతక పద్యమాల పుస్తకం రచించారు.

2021లో దేశభక్తి గేయాలు అనే పుస్తకం రచించారు. ఎన్నో అభ్యుదయ గేయాలు, భజన గేయాలు రాశారు.

ఉపాధ్యాయుడిగా 22 ఏళ్లు పనిచేయడం మిక్కిలి ఆనందాన్ని సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం విద్యాభివృద్ధి కృషి చేస్తానని అన్నారు.

కుటుంబ నేపథ్యం

పెద్దింటి శశిధర్‌వర్మ
భార్య : సుమతి
కుమార్తెలు – అల్లుళ్లు
శ్రీవిద్య – తెప్పల అన్వేష్, గోదావరి చైతన్య బ్యాంకులో ఉద్యోగం
శ్రీలక్ష్మి – నవీన్, పుణెలో ఇంజినీర్
కుమారుడు : శ్రీనాథ్, ఇంజినీరింగ్ చదువుతున్నాడు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పది, ఇంటర్‌ల్లో ఉత్తమ మార్కులు సాధించిన శిష్టకరణ విద్యార్థులకు ఆ సంఘం తరుపున ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. నగరంలోని శిష్టకరణ అసోసియేషన్ భవనంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఈ సంఘం తరుపున ఆదివారం సత్కరించారు. ఈ మేరకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. సంఘ నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), బలివాడ మల్లేశ్వరరావుల ఆధ్వర్యాన నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిభావంతులను స్ఫూర్తితో ప్రతిఒక్క విద్యార్థీ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశ్రాంత సైంటిస్టు ఆరికతోట కనకరాజు నగదు, మెడల్స్ అందివ్వడం ఆనవాయిగా పెట్టుకుని ఈ ఏడాదీ అందజేశామని అన్నారు. కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు మరింత శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో బెహర రామచంద్రరావు, సదాశివుని రామకృష్ణ, పట్నాయకుని మధు, ఆర్.వి.ఎన్.శర్మ, శ్రీనివాస్ పట్నాయక్, గోకుల్ విజయ్, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వరరావు

నంది అవార్డుకు కళాకారుల ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


వెంకటేశ్వర పట్నాయక్


శృతి పట్నాయక్

ఎన్‌టిఆర్ స్మారక అవార్డు, నందమూరి బంగారు నంది అవార్డుకు ఇచ్ఛాపురానికి చెందిన కళాకారులు చిన్న గురుస్వామి, చిన్నారులు ఎంపిక య్యారు. యుగ పురుషుడు, తెలుగువారి కీర్తి పతాక విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా నందమూరి స్వర్ణ నంది పురస్కారాలకు గాత్రం నాట్యం సంగీతం సాహిత్యం విద్య, వైద్య, న్యాయవాద, టివి, సినీరంగం, రాజకీయరంగం, వ్యాపార, పారిశ్రామిక, క్రీడ, కళారంగం, జ్యోతిష్యం వాస్తు, అర్చక పురోహిత తదితర రంగాల వారికి ఎంపిక చేశారు. అందులో భాగంగానే గాత్రానికి 30 ఏళ్ల గా ఎన్నో ప్రాంతాల్లో రెండు వేలు స్టేజ్‌ల్లో తమ గాత్రాన్ని అందించిన ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర పట్నాయక్ (చిన్న గురు స్వామి) ఎన్‌టిఆర్ స్మారక అవార్డుతో పాటు బంగారు నంది అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే నాట్యానికి 15 ఏళ్ల వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఇచ్ఛాపురం నాట్య గురువు బి-గ్రేడ్ ఆర్టిస్టు శివ నంది అవార్డు గ్రహీత నాట్య శృతి పట్నాయక్‌కు రెండోసారి స్వర్ణ నంది అవార్డు కైవసం చేసుకుంది. బి-గ్రేడ్ ఆర్టిస్టు దట్టి కావ్య, నీలాపు శైలు, సిల్లా పూజ, చాట్ల జయలక్ష్మి, ఆశిపు శ్రీతాణిలు నందమూరి స్వర్ణ నంది అవార్డులకు ఎంపికైనట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ తెలియజేశారు. ఈ అవార్డులను ఈ నెల 28న తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో కళాకారులకు అందిస్తారు. వీరు ఎంపికపై చిన్నారుల తల్లిదండ్రులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షునిగా నాయక్

ప్రజాశక్తి- పలాస



కుమార్ నాయక్

మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (24 క్రాఫ్ట్) జిల్లా అధ్యక్షునిగా పలాసకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్ నియమకయ్యారు. ఏపి అధ్యక్షులు జె.ఎస్.రాజేంద్ర, సెక్రటరీ వి.వాసవి ఈ నియామకపత్రాన్ని ఆదివారం అందజేశారు. ఏపి విభజన అనంతరం ఉత్తరాంధ్రలో సినీహబ్ నిర్మాణానికి మా ఛాంబర్ కృషి చేస్తుందని అన్నారు. ఉద్దాన ప్రాంతంలో సినిమా సూటింగ్‌లు చేపడతామని, విస్తారమైన లొకేషన్లు పలాస ప్రాంతంలో ఉన్నాయని కుమార్ నాయక్ తెలిపారు. పలాస వ్యక్తికి ఫిలిం ఛాంబర్ జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు సిక్కోలు జానపద కళావేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, భీలాయావాని పత్రిక వృత్త ప్రసాదరావు, సినీనటులు లండ రుద్రమూర్తి, జన జాగృతి సంస్థ అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రోణంకి హేమారావు, ఎంప్లాయీస్ విశ్రాంత అధ్యక్షులు తమ్మినేని మాధవరావు, లలిత కళారంజని, అధ్యక్షులు చిన్నారావు, స్థానిక సినీకళాకారులు హర్షం వ్యక్తం చేశారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ట్రూఫ్రెండ్ సభ్యులు

పళ్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: తమ మిత్రులు స్వర్గీయ మట్టా మహేష్, పరిటాల ప్రభాకర్‌ల జ్ఞాపకార్థం నగరంలో ట్రూఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని శాంతి కళ్యాణ అనురాగ నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పొన్నాడ రుషి, ఈశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, రిటైర్డ్ తహశీల్దార్ బుక్కూరు ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ తమ మిత్రులతో ఉన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వృద్ధులకు, చిన్నారులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పులఖర్ల సునీల్ కుమార్, గర్భాపు ప్రభాకర్, కన్నబాబు, దాస్యం నాని, అల్లాడ చంద్రబాబు, రాకోటి మధు, బరాటం శ్రీనివాస్, కడియం వెంకటేష్ పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆక్రమణల తొలగింపు

ఇచ్ఛాపురం: పట్టణంలో బస్టాండ్ కూడలి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద షాపు ఆక్రమణలను కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆదివారం తొలగింపు చేపట్టారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇద్దరు చేసిన ఆక్రమణలకు అందరి షాపులకు కాలువపై ఉన్న గట్టులు తొలగించడం ఆ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఇద్దరు ముందుకొచ్చి వ్యాపారస్తులను మానేసి అందరినీ తొలగించడం అన్యాయమని వాపోయారు.


పాల్గొన్న అతిథులు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఇచ్ఛాపురం: పట్టణంలోని సురంగి రాజా మైదానంలో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ (ఐసిసి) ఆధ్వర్యాన జీఎన్‌ఆర్ క్రికెట్ క్లబ్, హైదరాబాద్ సౌజన్యంతో ఎన్‌బిపిఎల్ (నర సింహరావు భానుమతి ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. ముందుగా ఐసిసి క్రికెట్ క్లబ్ గౌరవ అధ్యక్షులు దాసరాజు, ఐసిసి క్రికెట్ క్లబ్ పర్యవేక్షకులు బత్తల వెంకటరమణ, అధికారుల కుమార్, కెప్టెన్ దక్షత సుమన్, బత్తిన బాలాజీ, నర్సు యాదవరావు, సత్యనారాయణ, ఐసిసి చీఫ్ కోచ్ గోపీ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆరంజ్ ఆర్మీ కెప్టెన్ శ్యామ్‌మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు.

అంబరాన్నంటిన సంబరం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంకలో ఏడు రోజులుగా జరుగుతున్న ఆశిరి పోలమ్మ నవరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న వేషధారణలు ఆహుతులను అలరిస్తున్నాయి. సాము గరిడి, కోయ డ్యాన్స్, భద్రకాళి, సంప్రదాయ నృత్యాలు, పామల బొమ్మలు చూపరులతో కేరింతలు కొట్టిస్తున్నాయి. దీంతో నెలవంక పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.


భద్రకాళి వేషధారణలో కళాకారులు


నివాళ్లర్పిస్తున్న స్వాతి

ఎఎంసి మాజీ డైరెక్టర్ 'ముద్దాడ' మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్, టిడిపి సీనియర్ నాయకులు ముద్దాడ గణేశ్వర రావు (53) ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన స్వగ్రామం గార మండలం అంపోలులో మృతి చెందారు. ఆయన మృతి సమాచారాన్ని తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షులు గొండు స్వాతి అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మృతదేహం వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నావాళ్లర్పించారు. ఆమెతో పాటు గార టిడిపి నాయకులు గొండు వెంకటరమణ మూర్తి తదితరులున్నారు.

కొట్లాటపై కేసు నమోదు

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లికి చెందిన టొంప బాలాజీ తన గొర్రె శనివారం తప్పిపోయింది. అదే గ్రామానికి చెందిన కోణారి కామయ్య, గంగయ్యలు ఇళ్ల సమీపం వీధిలోకి వెళ్లి దుర్భాష లాడారు. బాలాజీ తమనే తిడుతున్నాడని భావించి ఆయనతో గొడవ పడ్డారు. అది కాస్తా కొట్లాటకు దారితీసింది. ఆదివారం బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గిరిబాబు

రూ.20 వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన రఘునాథ మహారణకు పూర్వ విద్యార్థులు రూ.20 వేలు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. రఘునాథ కుమార్తె మేఘన మహారణ ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాస్థాయిలో 7వ స్థానం సాధించింది. ఈ ఆమె ఉన్నత చదువుల నిమిత్తం 1983-84లో పదో తరగతి చదువుకున్న రఘునథ్ సేహితులు స్పందించి ఆర్థికంగా ఆదుకున్నారు. కార్యక్రమంలో మల్లా కుమారస్వామి, పి.మధు, కృష్ణచంద్రసాహు, రమేష్ సాహు, ఉప్పాడ అప్పారావు, బెలిసొంఠి శ్రీను, బి.భీమరాజు, బోసుబాబు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నీలకంటేశ్వర దేవాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.


తనిఖీ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

అమీన్‌సాహెబ్‌పేటలో కార్డాన్‌సెర్చ్

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేటలో పట్టణ పోలీసులు, అధికారులు ఆదివారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఆకస్మింగా తనిఖీ చేపట్టి ఎటువంటి పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పలు ట్రాన్స్‌పోర్టు గోదాములను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడులో సోమవారం అమరుల 34వ సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాల వద్ద ఆదివారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య దశలోనే పార్టీ నిర్బంధాన్ని, అణచివేతను ఎదుర్కొని, దాని నుంచి కోలుకొని మరలా పునర్నిర్మాణానికి పూనుకుందని అన్నారు. జిల్లాలో తొలి బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులైన పంచాది కృష్ణమూర్తితో ఆపటు మరో ఏడుగురు అమరులైన రోజును అమరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. జీడి పంటకు మద్దతు ధర అంతర్జాతీయ లావాదేవీల మధ్యలో రైతులను ఆదుకునే విధానాలను చేపట్టాలి. ఉద్దానంలోని జీడి, కొబ్బరి పంటల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లేబరేషన్ నాయకులు దుష్యంతు, కామేశ్వరరావు, రామారావు, అప్పారావు, కైలాష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బాలకృష్ణ, కుసుమ, రాపాక మాధవరావు, గోపి రామకృష్ణ, ఉమాపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతుండడంతో కల్లేపల్లి, మోపసు బందరు, జాలారిపేట, సాధుపేట, పెద్ద గనగలపేట, చిన్న గనగలపేట, పుక్కలపేట, నరసయ్య పేట తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.